# దరిద్రుడు! ★

కథకుడు:
మునిపల్లె రాజు

సంజకెంజాయలు నలుదిక్కులా కమ్ముకొంటున్నాయి అప్పుడే. చిన్నచిన్ని లేతమబ్బులతో ఆవృతమైన ఆకసవీధిని, యిసుక దుమారాలు కప్పివేస్తున్నాయి అప్పుడప్పుడు. ఊరిలోని రణగొణ ధ్వని, ఆదీపావళి సంతోషకలాపాలు అస్పష్టంగా వినబడుతున్నాయి కాలువఒడ్డున కూర్చున్న హరికి.

ఇది రోజూ సామాన్యంగా కాలచక్రంతో దొర్లుకువచ్చే సాయంతనం గాదు. సంవత్సరంలో... దీర్ఘమైన ఆపన్నెండు నెలల్లో... ఆమూనూట అరవై దినాల్లో, ఒక్కరోజున, ఒకసారిమాత్రమే వస్తుంది యీ దీపావళి సుదినం. విశాలవిశ్వగోళంలోని సంతోషమంతా మూర్తీభవించినట్టుగావుంది ఆసంధ్యారాగంలో.

ఊళ్లఊళ్లనుండి అల్లుళ్లు శ్వశురగృహాలకు వచ్చి— నెలలక్రిందట చూచిన తమ ప్రేయసీమణుల్ని ఆపర్వదినంలో, నూతనశోభతో అలరారుతున్న తమ భార్యలను...అవ్యాజానందంతో వీక్షిస్తూ గంటల్ని క్షణాలుగా గడుపుతున్నారు! ఎక్కడెక్కడో కళాశాలల్లో చదువులో మునిగిపోయిన యువక విద్యార్థులు--ఆ నిఖిలానందమయమైన గంటలకు తమ యిళ్లు చేరుకొన్నందుకు— వేడివేడి యువకరక్తంతో వుర్రూతలూగుతూన్న వారి వుద్వేగమగ్న హృదయాలకు తగిన ప్రోత్సాహం, యిస్తూన్నాయి ఆనిమిషాలు. నూతనవస్త్రాలుధరించి నీటుగా షికార్లు చేస్తున్నారు పిల్లలు—అరంగురంగుల దీపతోరణాలు నాట్యమాడుతోన్న వీధులలో, ఏమూలనైనా..... అసలు యావత్తువిశ్వంలో—విచారం, దానిఛాయలకు నిలువనీడేలేదని తలలూగిస్తున్నాయి కళకళలాడుతోన్న—వెలుగులు.

ఆగంభీర ప్రశాంతతలో కూర్చున్న హరిని, ఏవో అనిర్వాచ్యమైన ఆవేదన కెరటాలు అలసట పెడ్తూన్నాయి. ఆద్యంతాలులేని హరిభావపరంపరలు అతనినొక విషాదప్రకృతికి మోసుకుపోతున్నాయి. పోయినకొద్దీ ఆవిచార ప్రవాహపులోతు క్రమక్రమంగా హెచ్చుతోంది. హరి పూర్తిగా మునిగిపోతున్నాడు ఆలోతు నీటిప్రవాహంలో.

హరి ఆలోచించుకున్నాడు: "విశాలప్రకృతిలో ఏజీవికీలేని ఆరాటమూ, ఆవేదనా, చిత్తసంక్షోభా తనకెందుకు?" అని. ఎక్కువకాలం విమర్శించుకోకుండానే అతనికి సమాధానం లభించింది. తానిప్పుడు దరిద్రదేవత ఒడిలో సుఖంలేని నిద్రను అనుభవిస్తున్నాడు. ఆకలత నిద్దురలో ప్రశాంతత శూన్యమైన తనకు, దుస్వప్నాలు వస్తున్నాయి ఒకటివెంటఒకటి. వాటిఫలితంగా తాను మనోవైకల్యానికిలోనై ఆవేదన పడ్తూన్నాడు. అంతే! దీనికంతటికీ కారణం తనపై దరిద్రదేవత విలయతాండవమన్నమాట.

ఆదారిద్ర్య శృంఖలాలను విడగొట్టుకొని తన జీవితపథాన్ని సుఖమయం చేసుకోవడానికి ఏదేనా మార్గంవుందా అని నలుదిక్కులా తనదీనదృక్కుల్ని సారించి యేదోగొణుక్కున్నాడు — తనలోతాను. అంధకారబంధురమైన తన, మనోక్షేత్రాన్ని కంచుకాగడాలతో గాలించాడు. స్ఫురించిన వుపాయాలు శూన్యం! అంతంలేని ప్రకృతిని ఒక్కసారి కలయజూచాడు దైన్యంగా, తనకేదైనా మంత్రోపాసన చేస్తుందేమోనని. నిరాశదట్టంగా అలముకొన్న ఆవిశాలప్రకృతిలోంచి యేవిధమైన జవాబూ రాలేదు అడ్డుతెరలను చీల్చుకొని.

"దరిద్రం! అది చాలా బలవత్తరమైనది. దాన్ని నువ్వువంచలేవు" అంటోన్నది కాలువలో ఒక్కఎగురుఎగిరి మాయమైన చిట్టిచేప.

ఇంకా ఈసృష్టి జాలంలో తనవంటి అభాగ్యజీవులెవరైనా వున్నారేమోనని. అతని జీవంలేని

కళ్లు పరిసరాలను దీర్ఘంగా తిలకించాయి. దూరాన్నుండి—ఎవరో తన ఈడుపిల్లలు వాహ్యాళికి బయలుదేరివస్తూన్నారు. అనూయగా, వారివంకా, మల్లెపూలలాంటి వారి తెల్లగుడ్డలవంకాంఅందచందంగా, గాలికి అల్లలాడుతోన్న ఆకాలరు చొక్కాలవంకా చూచాడు. మళ్లీ అనిర్జీవ నేత్రాలతోనే, అపిచ్చిచూపులతోనే — నిశ్చలమైన కాలువనీటిలోనికి చూచాడు. వికాసమూ, వినోదమూ, దీప్తిలేని— తన విచార ఛాయల ప్రతిబింబం అస్పష్టంగా అవుపిస్తోంది అతని విశాల నాసికాపుటాల్నుండి దీర్ఘనిశ్వాసమొకటి దూసుకువచ్చింది. భుజంమీద—తనచొక్కా పెద్దచిరుగు, క్షురకర్మలేక దట్టంగా దుబ్బగాపెరిగిన తనకేశాలూ—అడ్డదిడ్డంగా ముఖంమీదపడి లేనిపోని వికృతరూపాన్ని కల్పిస్తూన్నాయి తనకు. ఇంకోసారి తనవంకా — ఆవస్తోన్న కుర్రాళ్లవంకా చూచాడు — చెమ్మగిల్లిన నేత్రాలతో తనకూ—వాళ్లకూ భేధాలు—ఒక్కటొక్కటిగా పోల్చుకుంటున్నాడు.

"వాళ్లు ధరించిన గుడ్డలు తనకులేవు. వాళ్ల ముఖాల్లోవున్నకళ, నూతనఅందం తనకులేదు. అసలు తానొక జీవచ్ఛవం! మరి తనకు డబ్బెక్కడ్నించి వస్తుంది? ఆవిలాసయుత జీవితం ఎక్కడ్నించి లభిస్తుంది?" అనుకున్నాడు మెల్లిమెల్లిగా హరి.

హరి వూహాప్రవంతులలోకి యింకా ఎన్నోవుపనదులువచ్చి ఐక్యమైపోతున్నాయి. తాను సమాజంలోని తదితరసభ్యులందరితో సరిసమానంగా చూడబడాలంటే తను బీదవాడై పుట్టివుండకూడదు. తనకూ అబస్తీలో—యింటిదగ్గిర్నుంచి ఏతండ్రో, ఏవుద్యోగంచేస్తున్న అన్నగారో, కావలసిన డబ్బుపంపిస్తూవుంటే వాళ్ళందరితోపాటు తానూ ఒకమనిషిగా పరిగణించబడతాడు. మరి తన స్వగృహంలో పరిస్థితీ! ప్రపంచంలోని దారిద్ర్యమంతా అక్కడే యిల్లుకట్టుకొని నివశిస్తోంది. తన తండ్రిచచ్చిన మరునాడే, యావదాస్తినీ, చేతికందినది అందినట్లుగా, అప్పులవాళ్లు కట్టుకపోయారు. చివరకు—ఏకలో, గంజో యింత నీడపట్టున కాచుకొని తాగడానికైనా లేకుండా తమయిల్లునుగూడా —అఋణదాతలనబడే నరరూపరాక్షసులే ఆక్రమించుకున్నారు గాతికట్టడాల గుండెలతో. ఏపుణ్యాత్ముడో చూపించిన ఒకజానెడుకొంపలో తనతల్లి—ఎక్కడ ఒకనాడు తనతండ్రి పూలమ్మినాడో, అక్కడే కట్టెలమ్ముకుంటూ విశాలవిశ్వంలోని ఒక విషాద భరితమూ, దుఃఖభాజనమూనైన జీవితాన్ని గడుపుతోంది.

తానెంత తెలివిగలవాడైనా, తనపేదత్వాన్ని కారణంగా తీసుకొని ఎంతమాత్రమూ లెక్కచేయరు తోటివిద్యార్థులు. తనెంతవిలువగల అభిప్రాయాన్నిచ్చినా త్రోసిపుచ్చుతారు, సంఘంలో ఎక్కడా తనకు గౌరవంలేదు. అవమానాగ్ని, క్రూరదానవసంఘంతోచేరి, తన్ను నిలువునా దహించివేస్తుంది!

వారాలయిండ్లకు వెడితే అక్కడా అంతే! తమపిల్లలంతా పనికిరావని విడిచిపెట్టిన ఆచవట కూరలూ, చీములుపట్టిన ఆచద్దెన్నమూ తనకు నిత్యనైవేద్యం! అకూడయినా, క్రమంగా దొరుకుతుందా అంటే అదీమృగ్యమే—! వాళ్లయింట్లో ఏమీ యిబ్బంది లేకపోయినాసరే- "ఇవ్వాళ మా యింట్లో వల్లగాదు నాయనా! ఇంకెక్కడైనా భోజనం చూచుకో" అని సునాయాసంగా అనేస్తారు. మరి ఆపాషాణహృదయాల కేంతెలుసూ తన ఆకటిమంటల దహనం! మాడిన ప్రేవులమర్మరధ్వనులూ!! దురభిమానం, తన్నాక్రమించుకోగా-యింకోచోట యాచించలేక కటికపస్తులు, పడుకుంటాడు.

తనంటే, గౌరవంలేకపోగా అనుమానం కూడా సమాజానికి. మరి తానొక బీదవాడు కాదూ! "ఒసేయ్! అవారాలపిల్లాడు హాల్లో వున్నట్టున్నాడు. ఆపెట్టెలదగ్గిర కూర్చో!" అనీ—

"ఏం బాబూ! తిన్నతర్వాత గూడా—ఎందుకట్లాతారట్లాడుతావ్! యింట్లో కూడా!",

అనీ—అప్పుడప్పుడు తన కర్ణపుటాలకు సోకి ప్రతిధ్వనిస్తుంటాయి కొందరు అజ్ఞానుల కూతలు. డబ్బుకు పేద అయినంతమాత్రాన— శీలానికిగూడా పేద అనా వీళ్ళ కుళ్లు అభిప్రాయం ? !

హరి — ఆలోచనలతో ఆవగింజంతయినా ప్రయోజనం పొందలేడు. అతనికేమీ పాలుబోలేదు ! అభివృద్ధి నిరోధకమైన సంఘం తన్నట్లా తంటాలు పెడ్తూంటే యింకెంతకాలం సహిస్తాడూ ? మళ్లీ హరి అనుకున్నాడు " సహించక చేసేదేమున్నది ?" అని యీ దానవసమాజంలో, ఈఘోరదురన్యాయాల క్రింద, యీపాపిష్టి యిక్కట్లమధ్యా, కాలంగడపటం దుర్లభం—! హరిబాబు చెమ్మగిల్లిన నేత్రాల వెంట జలజలమని ప్రవహించసాగాయి కన్నీటి కాల్వలు !

విరామమెరుగని అతడి లేతబుర్ర వేడిగా, చురుకుగా పనిచేస్తోంది ఈడుకుమించిన—భావాలతో ! తనవలె అభాగ్యులెందరో, సంఘవైపరీత్యం క్రింద, పడి నలిగి నలిగి కుమిలిపోతున్నారు. వాళ్లందరూ, ఆ అభాగ్య జీవితాల్ని, మధురమైన తమ మృదులభావాలకు తమ మనస్సుల్లోనే సమాధులు నిర్మిస్తూ, అత్యంత విషాదభరితమైన సంఘటనల్నెదుర్కుంటూ భూమాతకు బరువుగా, తమకొరకే అన్నట్లుగా బదకడంలేదూ ? చైతన్యంలేక, తామున్న పాడు వాతావరణంలోనే పెరిగి ప్రాణాలు విడుస్తున్నారు నిర్లక్ష్యంగా, తమ విలువను తాము గుర్తించలేక ! తాను యింత విచారించి, ఆలోచించి చేయగలిగిందంతా అంతేఅవుతుంది !

బరువుగా పాదాల్ని కదుపుతూ, లేతగడ్డి చేతగూడా అవమానించబడుతూ, నడువసాగాడు హరిబాబు. ఆమైదానంలో, ఆనిశ్శబ్దతలో అతనికి తన వెంటవస్తోన్న కారుచీకట్లో తోడు! తలపైకెత్తి చూచాడు. మానవజీవితంలోని ఆశాజ్యోతుల్లాగా మినుక్కుమినుక్కుమంటోన్న తారకలు చంద్రుడులేని ఆకాసవీధిలో నిల్చున్నాయి. వాటినిచూసి హరి అన్నాడు. "మీరు వెలుగుతున్న ఆశాజ్యోతులు కారు ! ఆరిపోతున్న ఆశాకిరణాలు"

మోతలుపెడ్తూ, చెవులకు తూట్లుపొడుస్తూ రైలుబండి తనవేపే వస్తోంది — దూరాన్నుంచి. అర్థంలేనిదాని భీషణధ్వనులకుకూడా అర్థం చెప్పసాగాడు హరిబాబు. అతని మతిభ్రమణం అలాగే వుంది. "నావలె వేగంగా నీజీవితరధాన్ని తోలు!" అని ఒక్కకూత వేసింది రైలుబండి. హరి, తన భవిష్యత్తును నిర్ణయించుకోవలసిన గడియలు సమీపించాయని గట్టిగా అనుకున్నాడు. దూరాలోచనలేని అతనిమానసవీధికి వేడిరక్తం ఉరకలుపెట్టి ప్రవహించింది.

చేతులుజోడించి ఒక్కసారి తనసమాజానికి 'నమస్తే' అన్నాడు ! అతని చివరిప్రార్థనయిది. "ఓ భగవంతుడా ! నీవున్నావో లేవో, నాకు తెలియదు. నాకష్టాల్ని నీవు అడ్డలేక ఒక అసమర్థుడివైనావు. ఇక నాకు దిక్కులేకపోయింది. నేను ప్రకృతిలో కలిసిపోతున్నాను. క్షమించు."

రైలు నిర్భీతితో హరిబాబు మీదుగా పట్టాలపైన దొర్లిపోయింది. మళ్లీరైలు నిర్గమించగానే ప్రకృతినిశ్శబ్దదేవత ఒడిలోకి వ్రాలింది. రైలు కట్టంతా, ఎర్రనికొత్తసమాధిగా తయారైంది. ఊళ్లోటపాకాయల ధాం! ధూం!! లు వినబడుతూనేవ్నై.


కథాంజలి
[కథల మాసపత్రిక]

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | 0 | 2 | 0 |
| సం॥ చందా | 1 | 12 | 0 |

ఏజంట్లులేని చోట్లలో ఏజంట్లు కావలెను.